పల్లెలు.. సమస్యల పుట్టిల్లు!

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ప్రజలకు అందుబాటులో లేని కార్యదర్శులు
- సమస్యలతో ప్రజల సతమతం





నల్లచెరువు-2 సచివాలయం , మండలంలోని ఓ సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో విశ్రాంతి తీసుకుంటున్న వీధి కుక్క

నల్లచెరువు: మండలంలోని గ్రామాలు సమస్యలకు పుట్టిళ్లుగా మారాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పంచాయతీ కార్యదర్శులు ఆడిందే ఆట పాడిందే పాట తయారైనట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయాల్లో ఉంటూ పల్లె ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన పంచాయతీ కార్యదర్శులు పట్టనట్టు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్య లోపంతో రోగాలు విజృంభించి ప్రజలు అవస్థలు పడుతున్నారు. అపార్ ఐడీకి సంబంధించి తల్లిదండ్రులు విద్యార్థుల బర్త్ సర్టిఫికెట్ల కోసం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలో 13 పంచాయతీలు, 10 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 12 మంది పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. ఇందులో నలుగురు కార్యదర్శులు సెలవుపై వెళ్లారు.

మండల కేంద్రంలో కాలక్షేపం

పంచాయతీ కార్యదర్శులు ఉదయం నుంచి సాయంత్రం అవుట్ అటెండెన్స్ వేయాల్సి ఉంది. కానీ కొందరు మధ్యాహ్నానికే ఇళ్లకు వెళ్లిపోతున్నట్లు ఆరోపణలున్నాయి. మరి కొందరు మండల కేంద్రంలో వీసీలు, మండల కార్యాలయంలో పని ఉందంటూ రకరకాలైన సాకులతో సచివాలయాల నుంచి జారుకుంటున్నట్లు తెలుస్తోంది. కొందరు ఇంటికి వెళ్లిపోతే మరి కొందరు మండల కేంద్రంలో తమ సొంత పనులు చూసుకుంటున్నట్లు సమాచారం. కార్యదర్శులు ఎవరూ పల్లె సమస్యలు అస్సలు పట్టించుకోవడంలేదు. దీన్ని అలుసుగా తీసుకొని కొన్ని సచివాలయాల్లో చిన్న స్థాయి ఉద్యోగులు తామేమీ తక్కువ కాదంటూ డ్యూటీ సమయంలో బయటకు వెళ్లి కాలక్షేపం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సచివాలయాల్లో మధ్యాహ్నం రెండు గంటలు అయితే సిబ్బంది ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోవడంతో సచివాలయాల్లో కుర్చీలు ఖాళీగా దర్శమిస్తున్నాయి. దీంతో గ్రామాల నుంచి పలు పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలు అధికారులు అందుబాటులో లేకపోవడంతో అసహనంతో వెనుదిరుగుతున్నారు. ఉద్యోగులపై పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి తలెత్తుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పలు సచివాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించకుండా విధుల్లో అలసత్వం వహిస్తున్నారని మా దృష్టికి వచ్చింది. సచివాలయ సిబ్బందితో పాటూ కార్యదర్శులు కూడా తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. సమయ పాలన పాటించకుండా విధి నిర్వహణలో అలసత్వం వహించే ఉద్యోగులపై దృష్టి సారించి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

– రఘునాథ గుప్తా ఎంపీడీఓ నల్లచెరువు

క్లుప్తంగా

ఉచితంగా సోలార్ సిస్టం



పేర్లను నమోదు చేస్తున్న ఏఈ

తాడిమర్రి: గ్రామాల్లో ఇళ్లకు విద్యుత్ సర్వీస్‌లు ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ సిస్టం ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ మదన్ మోహన్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం ఆయన సిబ్బందితో కలసి ఇంటింటా తిరుగుతూ పేర్లను నమోదు చేసుకున్నారు. విద్యుత్ బిల్లులను స్కాన్ చేసుకుని పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సర్వీసులు (మీటర్లు) ఉన్న ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా 2 కిలోవాట్స్ లేదా 3 కిలోవాట్స్ సామర్థ్యం గల సోలార్ సిస్టం ఏర్పాటు చేస్తాయన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందిస్తామని పేర్లు నమోదు చేయించుకుని సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆపరేటర్ మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

తనకల్లు: తుమ్మలవాండ్లపల్లికి చెందిన మేఘన (15) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ గోపి ఆదివారం తెలిపారు. వివరాలు... గ్రామానికి చెందిన గోవిందప్ప కుమార్తె మేఘన కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కడుపు నొప్పిని తాళలేక ఈ నెల 16న ఇంట్లో పురుగుల మందుతాగిందిం. గమనించిన కుటుంబ సభ్యులు బాలికను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ



రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లను సక్రమంగా ఉపయోగించుకుని పంటలను సాగు చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. 60 మంది రైతులకు సబ్సిడీ ధరపై ఈ పరికరాలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఎంఐఏఓ రవిశేఖర్, పరిటాల శ్రీరామ్, కంపెనీ ప్రతినిధులు పలువురు నాయకులు,రైతులు హాజరయ్యారు.

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడండి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లిలో శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని సిద్దరాంపురం సర్పంచ్ రమణయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో శ్మశాన వాటిక కోసం సర్వే నెంబర్ 711లో 1.40 ఎకరాలను కేటాయిస్తూ గత ప్రభుత్వంలో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆ భూమికి సంబంధించి పట్టా ఉందని బుకాయిస్తున్నాడన్నారు. అయితే అధికారులు విచారణ చేపట్టి అధికారులు గతంలో కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. ఇదే విషయమై ఇప్పటికే కలెక్టర్ చేతన్‌కు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు.

సజావుగా సామాజిక తనిఖీ 'ప్రజావేదిక'



బహిరంగ సభలో నివేదిక చదివి వం

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం సజావుగా జరిగింది. డ్వామా పీడీ విజయప్రసాద్, ఏపీడీ జ్యోతి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీలో వెల్లడైన అంశాలను చదివి వినిపించారు. మండలవ్యాప్తంగా ఉపాధి హామీ కింద 2023–24 సంవత్సరంలో 9.7 కోట్ల పనులు చేపట్టారని తెలిపారు. మొత్తం 13 పంచాయతీల్లో 1641 పనులు జరగ్గా ఇందులో రూ.84 లక్షలు అక్రమాలు జరిగినట్లు వెల్లడించారు. దీంతో ఉన్నతాధికారులు బాధ్యుల నుంచి సదరు సొమ్మును రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ శ్రీనివాసులు రెడ్డి, రఘునాథరెడ్డి,ఎ సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కంది పంటపై తప్పుడు నివేదికలు



రాఘవంపల్లి వద్ద కంది పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బత్తలపల్లి: ధర్మవరం నియోజకవర్గంలో కంది పంట దిగుబడిపై వ్యవసాయ సిబ్బంది జిల్లా అధికారులకు తప్పుడు నివేదికలను పంపినట్లు ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య ఆరోపించారు. ఆదివారం రాఘవంపల్లి వద్ద సాగు చేసిన కంది పంటను సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కంది పంటలో దిగుబడిపై ఇటీవల 'కంది పోతోంది..!' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడిందన్నారు. దీనికి జిల్లా ఉన్నతాధికారులు నివేదికను పంపాలని వ్యవసాయాధికారులకు ఆదేశాలు రావడంతో వారు ఉన్న ఫలంగా మండలంలో కంది పంటలను పరిశీలించారన్నారు. అయితే కంది సాగు చేసిన రైతులకు భరోసా ఇవ్వకుండా, జిల్లా ఉన్నతాధికారులకు మాత్రం ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నివేదికను పంపారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు మండలంలో పర్యటించి రైతుల దుస్థితిని గుర్తించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎకరాకు వెంటనే రూ.20వేలు పరిహారం ఇవ్వాలన్నారు. పీఏబీఆర్ కుడి కాలువ నీటితో చెరువులన్నీ నింపాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మాల్యవంతం కుళ్లాయప్ప, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, సీపీఐ నాయకులు లింగారెడ్డిపల్లి ఆదెప్ప, జయమ్మ, రాఘవంపల్లి కేశవరెడ్డి, నరసింహులు, రైతు సంఘం మండల కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవాలి



ఇరు జట్ల కెప్టెన్లతో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, క్రికెట్ కోచ్ జయరాం

బత్తలపల్లి: ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో రూరల్ క్రికెట్ సూపర్‌లీగ్ అండర్–15 బాలుర విభాగంలో రాప్తాడు, నార్పల జట్ల మధ్య పోటీలను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన నార్పల జట్టు 39.1 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. అనంతరం రాప్తాడు జట్టు కేవలం 10.5 ఓవర్లలో 28 పరుగులకే కుప్పకూలింది. నార్పల జట్టులో వర్మ 48 పరుగులు, సంజయ్ 36 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లోనూ రాణించి ఆరు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. సోమవారం ఆర్డీటీ అనంతపురం మెయిన్ గ్రౌండులో ధర్మవరం, నార్పల జట్లు మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ క్రికెట్ కోచ్ జయరాం తెలిపారు. ఈ పోటీలను ఆర్డీటి సిబ్బంది తదితరులు వీక్షించారు.

సీపీఐ శత జయంత్యుత్సవాలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ నేత మధు

తాడిమర్రి: ఈనెల 26న ధర్మవరంలో జరిగే సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మధు కోరారు. మండలంలోని పిన్నదరి గ్రామంలో ఆదివారం సీపీఐ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో సంక్షేమ పథకాలు ప్రకటించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగాలే హామీల అమలును విస్మరిస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, బత్తలపల్లి మండల కార్యదర్శి బండల వెంకటేష్, తాడిమర్రి మండల అధ్యక్ష, కార్యదర్శులు బీసాని లక్ష్మీనారాయణ, దాసు, సన్నపెద్దన్న, చౌడప్ప, నారాయణ, సత్తెప్ప, సత్యమయ్య, ఆదెప్ప పాల్గొన్నారు.

అవగాహనతో మోసాలు అరికట్టొచ్చు



మాట్లాడుతున్న డిపో మేనేజర్ ఇనయతుల్లా

పుట్టపర్తి టౌన్: వినియోగదారులు అవగాహనతో మోసాలు అరికట్టొచ్చని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాబయ్య, ఆర్టీసీ డీఎం ఇనయతుల్లా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డీఎం అధ్యక్షతన జాతీయ వినియోగదారులు రక్షణ వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. వస్తువుల కొనుగోలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వినియోగదారులు సంఘం సభ్యుడు మనిమాల, డిప్యూటీ తహసీల్దార్ రమేష్,హెడ్ కానిస్టేబుల్ మధు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల్లో డ్రోన్ నిఘా

పుట్టపర్తి అర్బన్: అటవీప్రాంతాల్లో అసాంఘిక కార్యాకలాపాలపై పోలీసులు డ్రోన్ ద్వారా నిఘా పెట్టారు. ఆదివారం వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి, బత్తలపల్లి, అమగొండపాళ్యం అటవీ ప్రాంతాల్లో డ్రోన్‌తో జల్లెడ పట్టారు.

బత్తలపల్లి: బత్తలపల్లి శివారు ప్రాంతాలు, సంగాల, వరదాపురం, డి.చెర్లోపల్లి, విశ్వనాథపురం, జ్వాలాపురంలో ఎస్‌ఐ సోమశేఖర్ సిబ్బందితో ఆదివారం డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాల అరికట్టేందుకు డ్రోన్ ద్వారా నిఘా పెట్టామన్నారు. డ్రోన్ కెమెరా టెక్నికల్ కానిస్టేబుల్ సుదర్శన్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఓబిలేసు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం మండల కమిటీ ఎన్నిక

ఎన్‌పీకుంట: వడ్డెర సంఘం మండలాధ్యక్షుడిగా బత్తల అక్కులప్ప ఎన్నికయ్యారు. స్థానిక శివాలయం వద్దనున్న కమ్యూనిటీ భవనంలో ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేపల్లి ఉత్తన ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా బత్తల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా దేరంగుల వెంకటరమణ, గౌరవ సలహాదారుగా దేరంగుల శ్రీనివాసులును ఎన్నుకున్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వల్లెపు గంగరాజు, కుంచెపు గంగరాజు, తలుపుల గంగరాజు, వడ్డేబాబు ఉన్నారు.

వైద్య శిబిరం



ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతపురం తిరుమల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సింధు, లోకనాథ్, దివాకర్, తేజస్విని, కిశోర్, దినేష్, మనోజ్, శివశంకర్, లక్ష్మిపతి, నవ్య, అనిరుద్, ధర్మవరం దేవి నర్సింగ్ హోం వైద్యురాలు పద్మ 105 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ తెలిపారు. రోటరీక్లబ్ సభ్యులు వైద్యులను సన్మానించారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ నాగమోహన్, రోటరీక్లబ్ క్యాంపు చైర్మన్ రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు నాగరత్నమ్మ, కార్యదర్శి పర్వీన్, న్యాయవాది సుమలత, రోటరీక్లబ్ సభ్యులు సుదర్శన్‌గుప్త, శివయ్య, పెరుమాల్‌దాస్, సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేషులు, రామకృష్ణ, కొండయ్య, ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు రాజేశ్వరి, భార్గవి, లలిత, లక్ష్మి పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలు జయప్రదం చేయండి



మహాసభల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం జయచంద్రారెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకోవడం చాలా సంతోషదాయకమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక సదుపాయాలు సాధించడంలో, మెరుగైన వేతన ఫలాల కోసం పోరాడటంలో ముందుందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసిందని గుర్తు చేశారు. కాకినాడలో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో స్వర్ణోత్సవ మహాసభలు జరుగుతాయన్నారు. ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో మహాసభలకు హాజరుకావాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, ఆంజనేయులు, సకల చంద్రశేఖర్, పెద్దకోట్ల సురేష్, బిల్లే రామాంజనేయులు, రాంప్రసాద్, హెచ్.రామాంజనేయులు, ప్రదీప్‌కుమార్, సాయిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల రైతులకు రాయితీలు

బత్తలపల్లి: రైతులకు ప్రభుత్వం అందించే రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్యాక్ హౌస్(30–20 అడుగులు) యూనిట్ విలువ రూ.4 లక్షలు కాగా రాయితీ రూ.2 లక్షలు లభిస్తుందని తెలిపారు. కోల్డ్ స్టోరేజ్(5 వేల మెట్రిక్ టన్నులు) యూనిట్ విలువ రూ.4 లక్షలు కాగా రాయితీ రూ.1.4 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. పండ్లు మాగబెట్టు గదులు(20 మెట్రిక్ టన్నులు) యూనిట్ విలువ రూ.20 లక్షలు కాగా రాయితీ 7 లక్షలు, సోలార్ కోల్డ్ రూం(14 మెట్రిక్‌టన్నులు) యూనిట్ విలువ రూ.12.50 లక్షలు కాగా రాయితీ 4.37 లక్షలు, కలెక్షన్ సెంటర్(60–40 అడుగులు)యూనిట్ విలువ రూ.15 లక్షలు కాగా రాయితీ రూ.6 లక్షలు ఉంటుందని వివరించారు. మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్(టమోట కెచప్, సాస్ మొదలగు ఉత్పత్తులు) రూ.25 లక్షలు కాగా రాయితీ రూ.10 లక్షలు లభిస్తుందని తెలిపారు. ఫారంపాండ్, పండ్ల మొక్కల నర్సరీ తదితర వాటిపై కూడా రాయితీలు లభిస్తాయని పేర్కొన్నారు. వివరాలకు స్థానిక హార్టికల్చర్ కార్యాలయంలో సంప్రందించాలని కోరారు.

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు



ర్యాలీగా వెళుతున్న చిన్నారులు



కొవ్వొత్తులు వెలిగించిన క్రైస్తవులు

కదిరి టౌన్: పట్టణంలోని సీఎజీ చర్చిలో ఆదివారం మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. అనంతరం చిన్నారులు శాంటాక్లాజ్ వేషధారణలో ప్రార్థనా గీతాలు ఆలపిస్తూ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు.

పుట్టపర్తిటౌన్: కర్ణాటకనాగేపల్లిలోని కింగ్స్ చర్చిలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా పాస్టర్లు ఏసు జీవిత చరిత్రను తెలియజేశారు.

ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడికి సన్మానం



మల్లికార్జునను సన్మానిస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ సీపీ శ్రీసత్యసాయి జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మల్లికార్జునను ఘనంగా సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మల్లికార్జున నివాసంలో ఆయన్ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్ర మంలో నాయకులు ఎస్టీడీ నరసింహులు, ఫొటోసాయి, సత్యనారాయణ, రామయ్య, బాబు, సాయి, మల్లికార్జున , భాస్కర్, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

కదిరి టౌన్: విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావలని కదిరి విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని కోనేరు సర్కిల్లో ఉన్న కృష్ణమందిరంలో విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

షెడ్యూల్ ప్రకారమే నీటి సరఫరా



పూలఓబయ్యపల్లి సమీపంలో జేసీబీతో కాలువకు అడ్డంగా మట్టిని వేయిస్తున్న దృశ్యం

తాడిమర్రి: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పీఏబీఆర్ కుడికాలువ ద్వారా 41 చెరువులను షెడ్యూల్ ప్రకారమే నింపుతామని జేఈలు చెన్నారెడ్డి, బసవరాజు పేర్కొన్నారు. ఆదివారం వారు బత్తలపల్లి, తాడిమర్రి మండలంలోని పీఏబీఆర్ కాలువను పరిశీలించారు. ఏకపాదంపల్లి సమీపంలో పప్పూరు చెరువుకు వెళుతున్న నీటిని బంద్ చేయించారు. అనంతరం పూలఓబయ్యపల్లి, నిడిగల్లు గ్రామాల సమీపంలో చెరువులకు నీరు వెళుతుండగా జేసీబీ ద్వారా కాలువకు అడ్డంగా మట్టిని వేయించి బంద్ చేయించారు. షెడ్యూల్ ప్రకారం ఎం.అగ్రహారం చెరువుకు నీరు సక్రమంగా వెళ్లేలా వారు చర్యలు చేపట్టారు. కాలువ పరిధిలో ఉన్న అన్ని చెరువులకు నీటిని సరఫరా చేస్తామని, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

అయ్యప్పస్వామికి లక్షార్చన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం గురుస్వామి సత్యనారాయణ ఆధ్వర్యంలో లక్షార్చన పూజలు నిర్వహించారు. ఉదయం అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం, గణపతి పూజ, మూలమంత్ర హోమం తదితర పూజలు చేపట్టారు. అనంతరం అయ్యప్పమాలధారులతో లక్షార్చన పూజలు చేయడంతోపాటు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి నరసింహులు, కోశాధికారి శ్రీరాములు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, సిబ్బంది

పుట్టపర్తి: స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఉమ్మడి అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం జగదీష్ ,పీడీ నాగరాజు ఆదివారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గణేష్‌రెడ్డి, మంజునాథ్, 9వ తరగతి చదువుతున్న మోహన్‌కుమార్ ప్రతిభకనబర్చడంతో నిర్వాహకులు వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. వీరు సోమవారం విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా వారు విద్యార్థులను అభినందించారు.

అనారోగ్యంతో ఏబీపీఎం మృతి



శ్రీరాములు (ఫైల్)

తనకల్లు: మండల కేంద్రానికి చెందిన ఏబీపీఎం(అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్) శ్రీరాములు (53) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఈయన కొండవెనుకపల్లి గ్రామీణ పోస్టాఫీసులో ఏబీపీఎంగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు అనంతపురం తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

దుప్పట్ల పంపిణీ

కదిరి అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, వివిధ సర్కిళ్ల వద్ద చలికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు శ్రీ శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ మోమిన్ సలీంబాషా ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. మండలస్థాయిలో జరిగే కార్యక్రమానికి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతి పత్రాలను అందజేయవచ్చని పేర్కొన్నారు.